ప్రజాశక్తి

శనివారం 30 మార్చి 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ఉక్కుపై రాజకీయం

అనకాపల్లి సభలో మాట్లాడుతున్న బిజెపి ఎంపీ అభ్యర్థి సిఎం రమేష్

- గెలిపిస్తే ప్రయివేటీకరణ ఆపుతానని బిజెపి ఎంపీ అభ్యర్థి సిఎం రమేష్ వ్యాఖ్యలు
- అనకాపల్లిలో పరిచయ సభ
- గతంలో ఎన్నడూ స్టీల్‌ప్లాంట్‌పై నోరెత్తని వైనం

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

ఓటర్లను మభ్యపెట్టి, మోసగించి లబ్ధిపొందడం బిజెపికే చెల్లించింది. ప్రజల సెంటిమెంట్లను పట్టుకొని, నమ్మించడంలో నైపుణ్యం కలిగిన ఈ పార్టీ రానున్న ఎన్నికల్లో విశాఖ స్టీల్‌ప్లాంట్ అంశాన్ని తమకు అనుకూలంగా మలచుకొనే ప్రయత్నం ఆరంభించింది. స్టీల్‌ప్లాంట్‌ను అమ్మితీరాలన్న పట్టుదలతో మోడీ ప్రభుత్వం వుండగా అనకాపల్లి బిజెపి ఎంపీ అభ్యర్థి సిఎం రమేష్ మాత్రం శుక్రవారం జరిగిన టిడిపి - జనసేన - బిజెపి కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల పరిచయ సభలో విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రయివేటుపరం కానివ్వబోమని, దీన్ని ఆధునికీకరించి, కావాల్సిన మైన్‌ను తెప్పించి ఎక్కువ మందికి ఉద్యోగాలు ఇప్పించేలా కృషి చేస్తానని అన్నారు. ఉక్కు ఫ్యాక్టరీ జవసత్వాలను దెబ్బతీసేందుకు ముక్కముక్కలుచేసి నష్టాలపాల్జేసి అమ్మకానికి పెట్టాలని మోడీ చేస్తున్న ప్రయత్నాలేవీ రమేష్‌కు తెలియనవికావు. ఉక్కు ఫ్యాక్టరీకి సొంతగనుల్లేని విషయమూ తెలియకకాదు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ అమ్మకానికి వ్యతిరేకంగా సుదీర్ఘ కాలంగా జరుగుతున్న పోరాటానికి సంఘీభావంగా తెలుగు బిడ్డగా ఏనాడూ ఉక్కు ఫ్యాక్టరీని అమ్మకానికి పెట్టొద్దని మోడీని కోరిన సందర్భాల్లేవు. రాజ్యసభలో మాట్లాడిన దాఖలాల్లేవు. అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని పెందుర్తి, అనకాపల్లి, యలమంచిలి నియోజకవర్గాల్లో ఉద్యోగుల ప్రభావం ఎక్కువగా వుందని గుర్తించి, వారిని మెప్పించేందుకు స్టీల్‌ప్లాంట్‌ను అమ్మనివ్వబోమని శుక్రవారం తన పరిచయ సభలో చెప్పుకొచ్చారు.

ప్రధాని మోడీ, కేంద్ర మంత్రులు, అధికారుల దగ్గరకు చొరవగా వెళ్లగలనని, అవసరమైతే కేంద్ర మంత్రులు, అధికారులను అనకాపల్లి రప్పించగలనని చెప్పిన ఆయన స్టీల్‌ప్లాంట్ అమ్మకపు నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నామన్న మాట ప్రధాని మోడీతో ప్రకటించగలగాలి. కానీ, మిగతా 2లో..

కళాశాల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు

విద్యార్థిని మృతిపై సమగ్ర దర్యాప్తు జరపండి

చైతన్య కళాశాల వద్ద విద్యార్థి, ప్రజా సంఘాల నాయకుల ఆందోళన

ప్రజాశక్తి - మధురవాడ : విశాఖ నగర శివారు కొమ్మాది వద్దనున్న చైతన్య ఇంజినీరింగ్ అండ్ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన విద్యార్థిని గురువారం అర్ధరాత్రి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాలని విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. వారు శుక్రవారం ఆ కళాశాల వద్ద ఆందోళన చేపట్టారు. విద్యార్థిని మృతిపై విచారణ జరపాలని, బాధ్యులను కఠినంగా శిక్షించాలని, కాలేజీ గుర్తింపు రద్దు చేయాలని పెద్దపెట్టున నినదించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్‌జె.నాయుడు, ఐద్వా మధురవాడ జోన్ నాయకులు భారతి, సిఐటియు నాయకులు రాజ్‌కుమార్ మాట్లాడారు. అమ్మాయి పంపిన వాట్సాస్ మెసేజ్‌ను మీడియాకు చూపించారు. తన కాలేజీ ఫ్యాకల్టీనే తన ఆత్మహత్యకు కారణమని సదరు విద్యార్థిని తన కుటుంబీకులకు వాట్సాప్ మెసేజ్ పంపించిందని తెలిపారు. ఆమె ఫొటోలు తీసి బ్లాక్‌మెయిల్‌కు పాల్పడటంతో తీవ్ర మానసిక క్షోభ అనుభవించి తుదకు చనిపోయినట్టు పేర్కొన్నారు.

ఇదిలా ఉండగా విద్యార్థిని మృతిపై విశాఖ నగర పోలీసులు, సాంకేతిక విద్యాశాఖ అధికారులు తక్షణం నివేదిక అందించాలని ఆదేశాలు జారీ చేసినట్టు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం తెలిపారు. ఆమెపై కాలేజీ యాజమాన్యం ఒత్తిడి పెంచిందా, ర్యాగింగ్ ప్రభావం ఏమైనా ఉందా, ఆమె ఇతర వేధింపులు ఎదుర్కొంటోందా అనే కోణంలో దర్యాప్తు చేయాలన్నారు.

నగరానికి క్రికెటర్ల రాక

వార్త 2లో..

బొగ్గు లారీ బీభత్సం

వార్త 5లో..

కేంద్రీయ విద్యాలయలో అడ్మిషన్లు ప్రారంభించండి

వార్త 4లో..

విశాఖ నగరంలో ప్రార్థనలు జరుపుతూ ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు - పలుచోట్ల ర్యాలీలు

వార్త 7లో..

భీమిలి టిడిపి అభ్యర్థిగా గంటా

ఎడతెగని ఉత్కంఠకు తెర

ప్రజాశక్తి - భీమునిపట్నం : భీమిలి నియోజకవర్గం నుంచి ఎట్టకేలకు టిడిపి అధిష్టానం విశాఖ ఉత్తర ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పేరును ఖరారు చేసింది. టిడిపి టిక్కెట్ నియోజకవర్గంలో ఎవరికి దక్కనుందోనని ఆ పార్టీ శ్రేణుల్లో నిన్నటి వరకూ ఎడతెగని ఉత్కంఠ ఉండేది. శుక్రవారం నాటికి గంటా పేరు ఖరారు కావడంతో ఉత్కంఠకు తెరపడింది. విజయనగరం జిల్లా చీపురుపల్లిలో పోటీ చేసేందుకు వెళ్లాలంటూ పార్టీ అధిష్టానం గంటాను కోరినప్పటికీ అక్కడికి వెళ్లేందుకు ఆయన సుముఖత వ్యక్తం చేయలేదు. భీమిలి టిక్కెట్ ఇవ్వాలని తన స్థాయిలో చివరి వరకూ అధిష్టానంపై ఒత్తిడి తెచ్చారు. చివరకు టికెట్ సాధించుకోగలిగారు. నాలుగున్నరేళ్లుగా టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉంటూ వచ్చిన కోరాడ రాజబాబు కూడా టిక్కెట్ కోసం తీవ్రంగానే ప్రయత్నాలు చేస్తూ వచ్చారు. గంటా, కోరాడ మధ్య టిక్కెట్ కోసం జరుగుతున్న పోటీలో వ్యాపారవేత్త దిలీప్ చక్రవర్తి, నెల్లిమర్ల నియోజకవర్గం నుంచి టిడిపి టిక్కెట్ ఆశించి భంగపడ్డ కర్రోతు బంగార్రాజు పేరు కూడా తెరపైకి వచ్చాయి. ఎట్టకేలకు గంటా శ్రీనివాసరావు పేరును అధిష్టానం ప్రకటించింది. ఈ నేపథ్యంలో టిక్కెట్టు ఆశించి మిగతా 2లో..

SELECTION TEST

COACHING FOR IIT-JEE & NEET

SSC/ICSE/CBSE : 30th March, 2024

TEST CENTRES

ASCENT CLASSES

1. Besides K.A. Paul Auditorium CBM Compound/Asilmetta, Vsp.
2. Opp: NSTL Family Gate, NAD Jn., Vsp
3. Opp: Cricket Stadium, Opp: MVV City 3rd Gate, P.M. Palem, Vsp

Exam Timings:10:00a.m. to 12:30p.m.

JYOTHI BALAVIHAR

STEEL PLANT

Sector-9, Ukkunagaram, Vizag.

Exam Timings: 2:30p.m. to 5:00p.m.

ascent CLASSES

Focussing on IIT-JEE & NEET

Besides K.A. Paul Auditorium Asilmetta, Vsp. Ph: 0891- 2556015

97040 04847 / 99482 74565

63032 13908 / 83410 64067

10th Completed students can apply

మొదటి పేజీ తరువాయి..

ఉక్కుపై రాజకీయం

ఆ పని మోడీతో రమేష్ చేయించలేరు. అందుకని గెలిపిస్తే ప్రయివేటీకరణ కానివ్వకుండా చేస్తానని నమ్మబలుకుతున్నారు. రమేష్ చెప్పినట్లు మోడీ ప్రభుత్వం చేస్తుందన్న ఆశలను తదుపరి మాట్లాడిన నాయకులూ కల్పించారు. అనకాపల్లి జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణ మోడీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు చేసిన అన్యాయాన్ని మర్చిపోయి ఈ సభలో పొగడ్తలు కురిపించారు. ఎంపీకి వున్న పరిమితులు, పరిధులు తెలిసి కూడా స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ, ఈ ప్రాంత అభివృద్ధి రమేష్ చేతిలో వున్నట్లు పొగిడారు. ఈ ప్రాంతానికి జరిగిన అన్యాయంపై రమేష్ మాట్లాడకుండా, వాటిపై హామీ ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని అంశాలపై హామీ ఇచ్చారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి సహా ఇరిగేషన్ ప్రాజెక్టుల అభివృద్ధికి, మూతపడిన తుమ్మపాల, ఏటికొప్పాక సుగర్ ఫ్యాక్టరీ తెరిపించడానికి ప్రయత్నం చేస్తానని అన్నారు. సబ్బవరం-మల్కన్‌గిరి నాలుగు లైన్ల జాతీయ రహదారి పనుల నిర్మాణానికి కృషి చేస్తానని చెప్పుకొచ్చారు.

ఇలా వచ్చి.. అలా వెళ్లారు

సిఎం రమేష్ పరిచయ సభకు ఆలస్యంగా వచ్చిన టిడిపి సీనియర్ నాయకులు చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడిన తరువాత ఎంతసేపూ లేరు. కొణతాల రామకృష్ణ కూడా కొద్దిసేపటి తరువాత వెళ్లిపోయారు. టిడిపి సీనియర్ నాయకుడు దాడి వీరభద్రరావు సభకు హాజరుకాలేదు. ఈ సభలో టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగజగదీశ్వరరావు, టిడిపి అభ్యర్థులు కెఎస్ఎన్ఎస్.రాజు, పైలా ప్రసాదరావు, వంగలపూడి అనిత, జనసేన అభ్యర్థులు సుందరపు విజయకుమార్, పంచకర్ల రమేష్‌బాబు, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పివిఎన్.మాధవ్ మాట్లాడారు.

భీమిలి టిడిపి అభ్యర్థిగా గంటా

భంగపడ్డ కోరాడ రాజబాబు గంటా గెలుపునకు ఏమేరకు సహకరిస్తారు అనేది వేచి చూడాల్సిందే. 2019 ఎన్నికల్లో ఇక్కడి నుంచే బరిలో ఉంటానంటూ చివరి వరకూ చెబుతూ విశాఖ ఉత్తర నియోజకవర్గానికి వెళ్లి గంటా ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయన 1999లో అనకాపల్లి ఎంపీగా, 2004లో చోడవరం, 2009లో అనకాపల్లి, 2014లో భీమిలి, 2019లో విశాఖ ఉత్తర నియోజక వర్గాల నుంచి ఎమ్మెల్యేగా గెలుస్తూ వచ్చారు.

ఇంటింటి ప్రచారంలో ఎంవివి.సత్యనారాయణ

18వ వార్డులో ఎంవివి.సత్యనారాయణ పాదయాత్ర

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ తూర్పులో ఈసారి వైసిపి జెండా ఎగురవేస్తామని, అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలుస్తామని విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు, వైసిపి తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవివి. సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఎంవిపి.కాలనీలోని సెక్టార్ 2లో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గడపగడపకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదేళ్లలో నియోజకవర్గంలో వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో వివిధ అనుబంధ సంఘాల నాయకులు, మహిళలు, పార్టీ శ్రేణులు, అభిమానులు, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు, చైర్మన్లు పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న వాసుపల్లి గణేష్ కుమార్

35వ వార్డులో వాసుపల్లి ప్రచారం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : అర్హులైన పేదలందరికీ వైసిపి ప్రభుత్వం సంక్షేమ ఫలాలను అందజేసిందని ఆ పార్టీ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం 35వ వార్డు పరిధిలోని కల్లుపాకల ప్రాంతంలో ఆయన పర్యటించారు. కార్యక్రమంలో నియోజవర్గం ఎన్నికల ఇంచార్జ్ ద్రోణంరాజు శ్రీవాత్సవ్, మాజీ కార్పొరేటర్ గరికిన గౌరి, వార్డ్ వైసిపి అధ్యక్షులు అలుపున కనకా రెడ్డి, వార్డు నాయకులు ఆది విష్ణు రెడ్డి, వాసర్ల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న చెన్నయ్ జట్టు క్రీడాకారుడు ధోని

హోటల్‌కు వెళ్తున్న ఢిల్లీ జట్టు క్రీడాకారులు

నగరానికి క్రికెటర్లు రాక

ఈ నెల 31న పిఎం.పాలెంలోని ఏసిఎ - విడిసిఎ క్రికెట్ స్టేడియంలో జరుగనున్న ఐపిఎల్ మ్యాచ్ కోసం చెన్నయ్, ఢిల్లీ జట్లు శుక్రవారం విశాఖ నగరానికి చేరుకున్నాయి. వారిని చూసేందుకు ఎయిర్‌పోర్టు వద్ద అభిమానులు ఎగబడ్డారు. ఆయా జట్లు బీచ్ రోడ్డులో తమకు కేటాయించిన హోటళ్లలో బస చేసేందుకు వెళ్లాయి.

వైసిపి వినాశకర పాలనను ప్రజలకు తెలియజేస్తాం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వైసిపి వినాశకర పాలనను ప్రజలకు తెలియజేస్తామని టిడిపి విశాఖ పార్లమెంట్ అభ్యర్థి ఎం.శ్రీభరత్ అన్నారు. శుక్రవారం టిడిపి వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమం టిడిపి కార్యాలయంలో జరిగింది. ముందుగా పార్టీ పతాకాన్ని శ్రీభరత్ ఎగరవేశారు. స్వీట్లు పంచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపి కూటమి అధికారంలోకి రావడం తథ్యమని అన్నారు. దారి తప్పి టిడిపికి దూరమైన నాయకులు, కార్యకర్తలు తిరిగి చేరాలనుకుంటే ఆదరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జీ, ఎమ్మెల్సీలు వేపాడ చిరంజీవిరావు, దువ్వారపు రామారావు, ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గాడు చిన్నికుమారి లక్ష్మి, పార్టీ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు, పలువురు కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శ్రీభరత్

'ప్రజాశాంతి పార్టీలోనే ఉన్నా'

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : బాబూ మోహన్‌కి బిఆర్ఎస్ టికెట్ వచ్చిందని, పార్టీ మారిపోయారని శుక్రవారం ఉదయం నుంచి జరుగుతున్న ప్రచారంలో ఏమాత్రమూ వాస్తవం లేదని, తాను ప్రజాశాంతి పార్టీలోనే కొనసాగుతున్నానని సినీ నటుడు, ప్రజాశాంతి పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థి బాబూ మోహన్ స్పష్టం చేశారు. ఆయన ఆశీలుమెట్ట వద్దగల కెఎ.పాల్ ఫంక్షన్ హాలులో శుక్ర వారం జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడారు. తాను గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో కార్మిక శాఖ మంత్రిగా సమర్థవంతంగా పని చేశానని అన్నారు.

ప్రజా శాంతి పార్టీ అధ్యక్షుడు కెఎ.పాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి, టిడిపి కుటుంబ, కుల పాలనకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నామని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పని చేస్తున్నామని గుర్తు చేశారు. వరంగల్ ఎంపీగా బాబూ మోహన్‌ను, విశాఖ ఎంపీగా తనను గెలిపించాలని కోరారు.

క్షయ వ్యాధికి మందుల కొరత

ప్రజాశక్తి-అడ్డతీగల : క్షయ వ్యాధిపై ప్రభుత్వం ఆర్భాటంగా అవగాహన ర్యాలీలు నిర్వహించడం తప్ప ఆచరణలో వ్యాధి నిర్మూలనకు తీసుకుంటున్న చర్యలు అంతంత మాత్రమే. వ్యాధిగ్రస్తులకు అవసరమైన మందులు కూడా సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో లేవంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. అడ్డతీగల సామాజిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఇప్పటికే గత ఐదు నెలలుగా మందులు వాడుతున్న వ్యాధిగ్రస్తులు ఆరో నెల మందుల కోసం ఆసుపత్రికి వెళ్తే క్షయ వ్యాధి నివారణ మందులు లేవని ఆసుపత్రి సిబ్బంది చెబుతున్నారు. ఇటువంటి పరిస్థితి ఏజెన్సీలోని పలు సిహెచ్‌సి, పిహెచ్‌సిల్లో ఉంది.

క్షయ వ్యాధికి గురైనవారు వారిలో ఉన్న వ్యాధి దశను బట్టి వైద్యుల సలహా మేరకు కనీసం 6-9 నెలల వరకు క్రమం తప్పకుండా మందులు వాడాల్సి ఉంది. కాని రోగులకు ఆరో నెలలోనే మందులు ఇవ్వకపోవడంతో గత్యంతరం లేని గిరిజనులు ప్రైవేట్ ఆసుపత్రులు, మందులు షాపులను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది. వ్యాధిపై సరైన అవగాహన లేనివారు, ఆర్థిక స్థోమత లేని వారు మధ్యలోనే మందులు వాడటం మానేస్తున్నారు. క్షయవ్యాధి గ్రస్తులకు వారి ఇంటికి వెళ్లి మందులు ఇవ్వాల్సి ఉంది. కానీ ఆ ప్రక్రియ సరిగా జరగడం లేదు.

కష్టాల్లో దక్షిణ నియోజకవర్గ ప్రజలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వైసిపి హయాంలో దక్షిణ నియోజకవర్గం ప్రజల తీవ్ర కష్టాలు పడ్డారని ఆ నియోజవర్గం జనసేన అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా 37వ వార్డు రెల్లి వీధి, జబ్బర్ తోట, పెయిందొర పేట ప్రాంతాలలో ఆయన ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో 37వ వార్డు జనసేన అధ్యక్షుడు గరికెన రవి, వార్డు నాయకులు ఎర్రంశెట్టి సురేష్, టిడిపి నాయకులు పొడుకు కుమార్, కోనాడ చిన్న, వొలిశెట్టి తాతాజీ, బిజెపి నాయకులు మూగీ దాసు, నియోజవర్గం టిడిపి నాయకులు పి.శివ ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాసకొండమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలోని బోయతిలి పంచాయతీ బోయతిలి, మద్దిగరువులో రాసకొండమ్మ అమ్మ వారి జాతర మహోత్సవాలు వచ్చే నెల 7వ తేదీ నుండి 9 వరకూ ఘనంగా నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ పెద్దలు తెలిపారు. ఈ సందర్భంగా జాతర పోస్టర్లను విడుదల చేశారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT GAJUWAKA
I.A.394/2023 IN I.A 42/2019
O.S. 35/2010

Between:
Sri Kuppa Atchiyyamma
. . . Petitioner/2nd Respondent.
And:
D.Sanyasi Rao (died) & others
...Respondents-2 to 5/Petitioners.
P.Satyavathi
. . . Respondent-6/Respondent-1.
To
Smt. Palika Satyavathi,
W/o. Late Guru Murthy, Hindu,
aged 80 years,
Residing at Bheemunipatnam,
Visakhapatnam.

The Petitioner/2nd Respondent filed the above Petition under Order IX Rule 7 of C.P.C against you and others. The above I.A is posted to **22-04-2024** for your appearance.

Please take notice that the above I.A 394/2023 in I.A 42/2019 in O.S.35/2010 for your appearance before the Hon'ble Court at **10.30 A.M. on 22/04/2024** in person or through duly instructed Advocate in the above Petition failing which the said Petition will be heard and determined ex-parte.

(By order of the Hon'ble Court)

M. PATTABHI RAMA RAO,
Smt. L Madhavi,
J. Hema Nikhitha, B. Sudhakar,
Advocates,
Gajuwaka.
Cell : 9246625602

Gajuwaka,
26/03/2024.

మహారాజశ్రీ రాజాం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో..
I.P: 1/2023

పిటిషనర్లు: **మూల మోహనరావు వగైరా**
రెస్పాండెంట్లు : **కొడాలి సతీష్ వగైరాలు.**
To,
R-4: సువ్వాడ సంతోష్, వయస్సు 36 సం॥, వ్యాపారి, సా॥నా॥, Door No: 2-45, నీలం ఆటోమొబైల్స్, కోర్టు రోడ్, Yజంక్షన్, గాజువాక, విశాఖపట్నం.

పై నెంబరు పిటిషనర్లును ఇన్ సాల్వెంట్‌గా పరిగనించమని కోరుచూ పైనెంబరు పిటిషన్ దాఖలు చేసినందున అందుకు మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న ఎడల పై కోర్టు వారి సమక్షం అందు తే॥ **29-04-2024ది॥ న ఉదయం గం॥ 10:30 ని॥ లకు** మీరు స్వయంగా గాని, వకీలు గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియజేసుకోగలరు. లేని ఎడల మీ పక్షం అందు తీర్మానించడం జరుగునని తెలియ చేయడమైనది.

శ్రీ. కె. రమణమూర్తి
శ్రీమతి. బి. మంజుల
పిటిషనర్ తరుపు న్యాయవాదులు,
రాజాం.

తేది:30.03.2024,
రాజాం.

లక్షలు వ్యయం... నెరవేరని లక్ష్యం!

● అసంపూర్తి పనులతో నిరుపయోగంగా ఈత కొలను

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో లక్షల్లో ప్రజాధనాన్ని వెచ్చించి స్విమ్మింగ్ పూల్ నిర్మించినా, పనుల్లో అలసత్వం వల్ల పూర్తి చేయకపోవడంతో నిరుపయోగంగా మారింది. ఏ ఆశయంతో దీన్ని చేపట్టారు, ఎంత మేర పనులు జరుగుతున్నాయో పర్యవేక్షించి పట్టించుకునే నాథులే లేకపోవడంతో ఏళ్ల తరబడి దీన్ని అలాగే వదిలేయడంతో చెత్త, అపరిశుభ్రతకు నెలవుగా మారింది. రూ.లక్షల్లో ప్రజాధనం వృథా తప్ప, ప్రయోజనం లేకుండా పోయిందని పలువురు ఆరోపిస్తున్నారు. వివరాలివి.

జివిఎంసి 65వ వార్డు వికాస్‌నగర్‌లో 2012లో అప్పటి జివిఎంసి పాలకవర్గం మంచి ఆశయంతో, ప్రజాప్రయోజనాన్ని కాంక్షిస్తూ స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి రూ.10 లక్షలను మంజూరుచేసి, పనులకు శంకుస్థాపన చేసింది. ఈతకొలనుతోపాటు చుట్టూ గోడ నిర్మాణానికి కూడాపూర్తిచేశారు. అయితే సంబంధిత కాంట్రాక్టర్ వేసిన టెండర్ కంటే, నిర్మాణవ్యయం ఎక్కువ కావడంతో పనులను పూర్తి చేయలేక సగంలోనే వదిలేశాడు. ఆ తర్వాత దీన్ని పట్టించుకునే నాథులే లేకపోవడంతో నిరుపయోగంగా మారిపోయింది.

వినియోగానికి దూరంగా ఉన్న ఈతకొలను ఇపుడు మందుబాబులకు ఆవాసంగా మారిపోయింది. పట్టించుకునే దిక్కు లేకపోవడంతో లోపల చెత్తాచెదారం పేరుకుపోయి, అపరిశుభ్రతకు నిలయమై, డంపింగ్‌యార్డుగా మారిపోయింది. రాత్రి వేళల్లో మందుబాబులకు, అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారిపోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి, మద్యం మత్తులో మందుబాబుల వీరంగంతో పరిసర ప్రాంతాల్లో ఉన్నవారంతా అవస్థలు పడే పరిస్థితి ఉంది.

డంపింగ్ పిట్‌గా మారిన వికాసనగర్ ఈత కొలను

గాజువాకలో యువత,చిన్నపిల్లలతోపాటు అన్ని వర్గాల వారు సేదదీరేందుకు, ఈత నేర్చుకోవాలనే లక్ష్యంతో ఎకరా స్థలంలో నిర్మించిన స్విమ్మింగ్ పూల్ పనికిరాకుండా ఉండిపోవడంతో స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఈతపై ఆసక్తి ఉన్నకొందరు ప్రయివేటు స్విమ్మింగ్ పూల్స్‌కు వేలల్లో ఫీజులు చెల్లించి జాయిన్ అయి, నేర్చుకుంటున్నారు. జివిఎంసి పరంగా ఇది వినియోగంలోకి వస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని ఈత ప్రియులు అంటున్నారు.

స్విమ్మింగ్ పూల్ దయనీయ పరిస్థితిని గమనించిన స్థానిక కార్పొరేటర్, సమస్యను జివిఎంసిలో ప్రస్తావించి,దీన్ని పూర్తిచేసి వినియోగంలోకి తెచ్చేందుకు కొన్ని నిధులు కేటాయించినట్లు తెలుస్తోంది. రాజకీయ కారణాలతో పనుల్లో జాప్యంజరగడం, ఈలోగా ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో సందిగ్ధత నెలకొంది. జివిఎంసి అధికారులు దీనిపై దృష్టి పెట్టి, పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

దీనిపై జివిఎంసి గాజువాక జోన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రసాద్‌బాబు వివరణ కోరగా, స్విమ్మింగ్‌పూల్ పనులు తొందరలో పూర్తి చేస్తామన్నారు. ఈ పనులకు సంబంధించి రీటెండర్ వేశామని, అవి ఖరారు కాగానే, పనులను మొదలుపెట్టి, వీలైనంత తొందరలోనే వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు చేపడతామన్నారు.

వృద్ధి రేటును పెంచి చూపడం సమంజసం కాదు

ఎపి కాంగ్రెస్ ఒబిసి విభాగం రాష్ట్ర చైర్మన్ మూల వెంకటరావు

ప్రజాశక్తి- మాధవధార :2047 నాటికి అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా మార్చుతానన్న బిజెపి ప్రభుత్వ వాగ్దానం నెరవేరిందని చెప్పుకోవడానికి అన్ని రంగాల్లో లేని వృద్ధిరేటును చూపించడం సమంజసం కాదనిఎపి రాష్ట్ర కాంగ్రెస్ ఒబిసి విభాగం చైర్మన్ మూల వెంకటరావు ఆక్షేపించారు. చాలామంది ఉన్నత పాఠశాల స్థాయి విద్యార్థులు డ్రాపౌట్స్‌గా మారుతున్నారన్నారు. దేశంలో అక్షరాస్యత రేటు, వియత్నాం వంటి ఇతర ఆసియా దేశాలతో పోల్చినా తక్కువగానే ఉన్నప్పటికీ పెంచి చూపించడం సరికాదన్నారు. దేశంలోని 140కోట్ల పైచిలుకు జనాభాలో సగానికిపైగా 30ఏళ్లలోపు యువతే ఉన్నారని, శ్రామిక శక్తి నైపుణ్యాలను మెరుగుపరచడం, నిర్మాణాత్మకమైన సమస్యలను గణనీయంగా పరిష్కరించడం ద్వారా ఆశించిన లక్ష్యాలను చేరుకోవాలే తప్ప, గణాంకాల్లో పెంచి చూపించడం వల్ల ప్రయోజనమేంటని ప్రశ్నించారు. దేశంలో ఉన్నత విద్యకు వార్షిక బడ్జెట్‌లో రూ.47వేల కోట్లు కేటాయిస్తే, దానికంటే అదనంగా దాదాపు రూ.67వేల కోట్లను చిప్‌ల తయారీకి ప్రభుత్వం రాయితీలను ఇవ్వడం ఎంతవరకు సమంజసమన్నారు. కరోనా తర్వాత పిల్లల్లో అభ్యసనా సామర్థ్యం 2012 కంటే ముందు స్థాయికి పడిపోయిందన్నారు. మూడవ తరగతి విద్యార్థులలో 20 శాతం మంది మాత్రమే రెండవ తరగతి పాఠాన్ని చదవగలుగుతున్నారన్న గణాంకాలే వీటిని స్పష్టం చేస్తున్నాయన్నారు.నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం, పాలనా వికేంద్రీకరణతో రాష్ట్రాలకు మరిన్ని అవకాశాలు, హక్కులు కల్పించడం ఎంతో అవసరమన్నారు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ కాంగ్రెస్ నేతృత్వం లోని ఇండియా కూటమి అధికారంలోకి వస్తేనే ఇది సాకారమౌతుందని వెంకటరావు ఆశాభావం వ్యక్తం చేశారు.

ఎన్నికల ప్రచార జోరు పెంచిన రాజు

ఎన్నికల ప్రచారంలో రాజును ఆశీర్వదిస్తున్న మహిళ

ప్రజాశక్తి- సీతమ్మధార : విశాఖ ఉత్తర నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు ప్రచారజోరు పెంచారు. ఉదయం వాకర్స్‌తోనూ, తర్వాత పార్టీశ్రేణులు, సంఘాలతో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నారు. పార్టీ ముఖ్యులు, నేతలతో కలుస్తూ ఎన్నికల ప్రచార కార్యాచరణ రూపొందించుకుని జోరుగా ముందుకు సాగుతున్నారు. ఇందులో భాగంగానే జివిఎంసి 55వ వార్డు జోగారావు నగర్, ఎర్రబెల్లి వారివీధి, తిక్కవానిపాలెం తదితర ప్రాంతాల్లో వార్డు కార్పొరేటర్ కెవిఎన్ శశికళతో కలిసి శుక్రవారం ఉదయం మార్నింగ్ వాక్ నిర్వహించారు.ఆయా ప్రాంతీయులతోపాటు వాకర్స్‌తో మాట్లాడి ప్రచారం చేశారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పాలనను అందిస్తున్న వైసిపిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్ రాయుడు శ్రీను, వార్డు నాయకులు రత్నాకర్, దుప్పల పూడి శ్రీను, గంగ మహేష్, ఎడ్ల సిద్ధార్థ, వైఎవన్ రాజు, సొంటి సురేష్, ఎస్.రెడ్డి, జామిదాస్, పోతరాజు, జోగి సతీష్, కరుణ, లక్ష్మి, యువజన విభాగం అంబటి శైలేష్, ఎం.సునీల్, సమ్మెట్ల వెంకటేష్, భోగవల్లి గోవిందు, సురెడ్డి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పార్టీ శ్రేణులతో ఆత్మీయ సమావేశం

సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గ వైసిపి కార్యాలయంలో జివిఎంసి 14వ వార్డు కార్పొరేటర్ కె అనిల్ కుమార్‌రాజు ఆధ్వర్యంలోనూ, 47వ వార్డు న్యూ బాపూజీనగర్ గాయత్రి ఫంక్షన్ హాల్ దగ్గర స్థానిక కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులతో ఆత్మీయసమావేశం ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వచ్చే ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని, అందరూ సమన్వయంతో పనిచేయాలని, ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కట్టుమూరి సతీష్, ఉత్తర నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, బాణాల శ్రీనివాసరావు, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు ఆళ్ల శివగణేష్, బల్ల శ్రీను, కోడూరి సత్యనారాయణ, కె సుశీల, 14వ వార్డు సీనియర్ నాయకులు, బూత్ కన్వీనర్లు, కార్యకర్తలు, పాల్గొన్నారు

వ్యూహాత్మకంగా పనిచేయండి : ఎంపీ బాబూరావు

రాజును అభినందిస్తున్న వైసిపి నేతలు

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వ్యూహాత్మకంగా అడుగులు వేయాలని రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు సూచించారు. రాష్ట్ర మారిటైమ్ బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి ఆహ్వానం మేరకు శుక్రవారం కెవిఆర్ ఎస్టేట్స్ ఆఫీసు వద్ద ఉత్తర వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజును కలిసి అభినందించారు. ఈసందర్భంగా కేడర్‌ను సమన్వయపరుస్తూ, ప్రజలతో మమేకమై ముందుకు సాగాలని, ప్రత్యర్థుల విమర్శలను తిప్పికొట్టి, గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఎంపీ గొల్ల బాబూరావు, ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజులను కాయల వెంకటరెడ్డి, కాయల సూరారెడ్డి సత్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కె. అనిల్ కుమార్‌రాజు, కిరణ్ రాజు, అంబటి శైలేష్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కారు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి- కె.కోటపాడు :కారు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని చౌడువాడ గ్రామంలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానిక పోలీసులు, మృతిని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం... చౌడువాడ గ్రామానికి చెందిన ఆళ్ల నూకరాజు (35) గురువారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో తన పొలం లోకి నడిచి వెళ్తున్నాడు. అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు మద్యం సేవించి చౌడువాడ గ్రామం నుంచి జుత్తాడ వైపు వెళ్తూ ఓవర్ స్పీడ్‌గా కారు నడిపి నడిచి వెళుతున్న నూకరాజును బలంగా ఢీ కొట్టారు. దీంతో కారు పక్కనే ఉన్న చెట్లను ఢీకొని రోడ్డు నుంచి కిందకి పల్టీ కొట్టింది. కారు ఢీకొన్న ప్రమాదంలో నూకరాజు తలకు బలంగా గాయాలయ్యాయి. వెంటనే ఆయన్ను 108 అంబులెన్సులో విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి నూకరాజు మృతి చెందారు. ఈ మేరకు కె.కోటపాడు ఎస్‌ఐ లక్ష్మీనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి- పద్మనాభం : విలాస్‌ఖాన్‌పాలెం గ్రామం వద్ద మణికంఠస్వామి బట్టీలో కూలిపనులు చేస్తున్న పశ్చిమబెంగాల్‌కు చెందిన ఒక కుటుంబంలోని యువతి గురువారం నుంచి కనిపించడం లేదని కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ జి.సురేష్ చెప్పిన వివరాల ప్రకారం పశ్చిమబెంగాల్ నుంచి వచ్చిన ముల్లా సిరజోల్ తన కుటుంబంతో విలాస్‌ఖాన్‌పాలెం బట్టీలో పనిచేస్తున్నాడు. ఆ కుటుంబానికి చెందిన 24ఏళ్ల ఫరీదా అనే మతిస్థిమితం లేని యువతి గురువారం అక్కడి నుంచి ఎటో వెళ్లిపోయిందని, దీంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ఆమెకి దొరకకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. అందిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ముమ్మరంగా ముత్తంశెట్టి ప్రచారం

ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

ప్రజాశక్తి -భీమునిపట్నం : భీమిలి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు శుక్రవారం ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండలంలోని రేఖవానిపాలెం, మూలకుద్దు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం సాగింది. ఈ సందర్భంగా ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ, గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంతోపాటు, పారదర్శకంగా సంక్షేమ పథకాలను రాజకీయాలకు అతీతంగా అందరికీ అందజేశామన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపిగా బొత్స ఝాన్సీని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో రేఖవానిపాలెం సర్పంచ్ ఎస్ శ్రీనివాసరావు, కొల్లి కోటిరెడ్డి, ఎంపిపి దంతులూరి వాసురాజు, పార్టీ మండల అధ్యక్షులు గాడు శ్రీను, సరగడ రఘునాథరెడ్డి అధిక సంఖ్యలో వైసిపి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు

భీమిలి బిఎస్‌పి అభ్యర్థిగా భాగం

ప్రజాశక్తి -భీమునిపట్నం : భీమిలి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బిఎస్‌పి తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలవనున్నట్లు మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షులు భాగం గోపాలరావు ప్రకటించారు. శుక్రవారం భీమిలిలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, బిఎస్‌పి ఉత్తరాంధ్ర ఇంచార్జి కె తిరుపతిరావు, విశాఖ లోక్‌సభ అభ్యర్థి పి శివప్రసాద్ కోరిన మేరకు ఆ పార్టీ నుంచి ఎమ్మెల్యే స్థానానికి పోటీ చేసేందుకు అంగీకరించినట్టు తెలిపారు.

రమణకు ఘన నివాళి

నివాళులర్పిస్తున్న సిపిఎం, సిఐటియు నేతలు

ప్రజాశక్తి -గాజువాక : స్టీల్‌ప్లాంట్‌లో 30 సంవత్సరాలుగా స్టీల్ పెయింట్ ఉద్యోగం చేస్తున్న జాలరిపల్లిపాలెం గ్రామానికి చెందిన రమణ శుక్రవారం మృతి చెందాడు. రమణ మృతి సమాచారం తెలుసుకున్న సిపిఎం, సిఐటియు నాయకులు శుక్రవారం వారి ఇంటికి చేరుకొని రమణకు నివాళులర్పించారు. రమణకు నివాళులర్పించిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం జగ్గునాయుడు, సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి,గంగారావు, స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు .రామస్వామి, నూకరాజు, అప్పలరాజు, సోమేష్, మహేష్, గురుమూర్తి ఉన్నారు.

31న ఐఐటి, నీట్‌పై అవగాహన

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక సంగివలస శశి క్యాంపస్‌లో శశి విద్యాసంస్థల ఆధ్వర్యంలో 5వ తరగతి, టెన్త్ పరీక్షలు రాసిన విద్యార్థులకు, ఈ నెల 31న ఐఐటి ఫౌండేషన్, ఐఐటి, నీట్ విద్యపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు శశి విద్యా సంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, సెక్రటరీ కరస్పాండెంట్ మేకా క్రాంతిసుధ శుక్ర వారం ఒక ప్రకటనలో తెలిపారు . అనుభవజ్ఞులైన అధ్యాపకులతో సందేహాలను నివృత్తి చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు, వారి తల్లి దండ్రులు వినియోగించుకోవాలని కోరారు

వైసిపిలో పలువురు చేరిక

. వైసిపిలోకి ఆహ్వానిస్తున్న ఆనంద్‌కుమార్

ప్రజాశక్తి -గోపాలపట్నం : విశాఖ పశ్చిమ నియోజకవర్గం, 89వ వార్డు నుంచి తెలుగుదేశం, జనసేన పార్టీలకు చెందిన 50మంది కార్యకర్తలు శుక్రవారం వైసిపిలో చేరారు. పిఎసిఎస్ చైర్మన్ ఆళ్ల పైడిరాజు ఆధ్వర్యంలో వైసిపిలో చేరిన వీరికి మర్రిపాలెం ఉడా లేఔట్‌లోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ కండువా వేసి, పార్టీలోనికి ఆహ్వానించి, అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వచ్చే ఎన్నికల్లో వైసిపి విజయానికి అందరం సమిష్టిగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైసిపి పశ్చిమ నియోజకవర్గ పరిశీలకులు ఎస్ఎ రెహమాన్, పేడాడ రమణికుమారి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశానికి దరఖాస్తు గడువు పెంపు
5 వరకు అవకాశం

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఏపి గురుకుల విద్యాలయాల్లో వచ్చే విద్యా సంవత్సరంలో 5, 6, 7, 8 తరగతుల్లో మిగిలి ఉన్న ఖాళీలు, మొదటి ఏడాది ఇంటర్, డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేందుకు గడువును వచ్చేనెల ఐదో తేదీవరకు పెంచినట్లు స్థానిక ఎపి బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ కోడి రాంబాబు శుక్ర వారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా ప్రకటించిన తేదీల ప్రకారం ఈనెలాఖరుతో గడువు ముగియనుండగా, దాన్ని వచ్చేనెల 5వ తేదీ వరకు పొడిగించారు. ఎపిఆర్ఎస్ఎటి,2024, ఎపిఆర్జెసి అండ్ డిసి, సెఇటి ,2024 ప్రవేశ పరీక్షకు ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు https ://aprs.apcfss .in వెబ్‌సైట్ ద్వారా ఏప్రిల్ 5వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

కేంద్రీయ విద్యాలయలో అడ్మిషన్లు ప్రారంభించండి

- స్టీల్‌ప్లాంట్ సిజిఎం (హెచ్ఆర్)కు సిపిఎం, సిఐటియు నేతల వినతి

వినతిపత్రం అందజేస్తున్న గంగారావు, రామస్వామి

ప్రజాశక్తి -ఉక్కునగరం : ఉక్కునగరంలోని కేంద్రీయ విద్యాలయలో ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఒకటో తరగతి నుంచి అడ్మిషన్లు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని, వివిధ తరగతుల్లో ఉన్న సీట్ల ఖాళీలను భర్తీ చేయాలని స్టీల్‌ప్లాంట్ సిజిఎం (హెచ్ఆర్) గాంధీకి 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి గంగారావు, స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను హెచ్ఆర్‌కు విన్నవించారు. స్టీల్‌ప్లాంట్ కేంద్రీయ విద్యాలయలో వచ్చే విద్యాసంవత్సరానికి తక్షణమే విద్యార్థులకు ప్రవేశాలను కల్పించడంతోపాటు, పాఠశాలలోని వివిధ తరగతుల సెక్షన్లను విలీనం చేయకుండా యథావిధిగా కొనసాగించాలని కోరారు. 2024-25 విద్యా సంవత్సరంలో ఒకటో తరగతి నుంచి అడ్మిషన్స్ కొనసాగిస్తామని గతంలో స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ప్రకటించినా, కేంద్రీయ విద్యాలయ యంత్రాంగం నుంచి దీనిపై ఎటువంటి ప్రకటన లేకపోవడంతో కార్మికులు, ఉద్యోగులు తీవ్ర ఆందోళనలో ఉన్నారన్నారు. వెంటనే కేంద్రీయ విద్యాలయలో వివిధ తరగతుల్లో ప్రవేశాలపై స్టీల్‌ప్లాంట్ యాజమాన్యంతోపాటు కేంద్రీయ విద్యాలయ యంత్రాంగం విస్పష్టమైన ప్రకటన విడుదల చేసి, ఉక్కు ఉద్యోగుల్లో సందేహాలు, భయాందోళనలను తొలగించాలని కోరారు.

ఐపిఎల్ మ్యాచ్‌ల నిర్వహణకు సర్వం సిద్ధం

- 31,3 తేదీల్లో విశాఖలో రెండు మ్యాచ్‌లు
- ఎసిఎ సెక్రటరీ గోపీనాథ్‌రెడ్డి వెల్లడి

ఎసిఎ సెక్రటరీ గోపీనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి -పిఎం పాలెం : విశాఖలో డాక్టర్ వైఎస్ఆర్ ఎసిఎ, విడిసిఎ వీడిసి అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఈనెల 31న జరిగే ఢిల్లీ క్యాపిటల్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్ల మధ్య జరగనున్న ఐపిఎల్ మ్యాచ్‌కు సర్వం సిద్ధమైందని ఎసిఎ సెక్రటరీ గోపీనాథ్‌రెడ్డి వెల్లడిం చారు. శుక్రవారం సాయంత్రం స్టేడియం ఆవరణలో మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈనెల 31న, వచ్చే నెల మూడో తేదీన విశాఖలో జరిగే ఐపిఎల్ మ్యాచ్‌లకు ఏర్పాట్లను ఇప్పటికే పూర్తిచేశామన్నారు. జిల్లా పోలీసు అధికారుల సహకారంతో ట్రాఫిక్ ఏర్పాట్లను చేసామన్నారు. రానున్న కాలంలో కర్ణాటక, తమిళనాడు తరహాలో స్కూల్ టోర్నమెంట్ మ్యాచ్‌లను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటిసారిగా నిర్వహిస్తున్న స్కూల్ టోర్నమెంట్ల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 20 వేల మంది క్రీడాకారులకు అవకాశం లభిస్తుందన్నారు. ఇంటర్నేషనల్ క్రికెట్ మ్యాచ్‌ల నిర్వహణ ద్వారా గడచిన నాలుగేళ్లలో విశాఖ క్రికెట్ స్టేడియం, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ప్రపంచస్థాయి ఖ్యాతిని ఆర్జించడం సంతోషంగా ఉంద న్నారు. ఇక్కడ మ్యాచులు ఆడిన క్రికెటర్లు ఇచ్చిన నివేదిక ప్రకారం బిసిసిఐ నివేదికలో ర్యాంకింగ్స్‌ను ప్రకటించి, వాటి ఆధారంగా మ్యాచ్‌లను కేటాయిస్తుం దని, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు అన్ని రకాల వసతులు కల్పన, మ్యాచ్ నిర్వహణ సిబ్బందికి అందించడంలో మంచి ప్రశంసలు అందాయన్నారు. కోవిడ్ తర్వాత విశాఖ క్రికెట్ స్టేడియంలో రెండేసి టెస్ట్, వన్డే, టి20మ్యాచ్‌లను విజయవంతంగా నిర్వహించా మని, ఇపుడు రెండు ఐపిఎల్ మ్యాచ్‌ల నిర్వహణకు ఎసిఎకు అవకాశం దక్కిందన్నారు.. సిటీ ఆఫ్ డెస్టినీగా ఖ్యాతి పొందిన విశాఖలో మరిన్ని అంతర్జాతీయ మ్యాచ్‌లను భవిష్యత్‌లో నిర్వహించేందుకు ఎసిఎ కృషి చేస్తుందని గోపీనాథ్‌రెడ్డి వెల్లడించారు.

'వి టెక్' ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లిములు

ప్రజాశక్తి- మాధవధార :మాధవధార ప్రాంతానికి చెందిన విటెక్ వాటర్ సొల్యూషన్స్ సంస్థ ఆధ్వర్యంలో జివిఎంసి 53వ వార్డు మర్రిపాలెం డాక్టర్ జాకీర్ హుస్సేన్‌నగర్ మసీద్ ఈ అల్ ఖదీర్ ప్రాంగణంలో స్థానిక ముస్లిం సోదరులకు శుక్రవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లిం సోదరులతో పాటుగా ముస్లిం మహిళలకు వివిధ రకాల ఆహార పదార్థాలు, పండ్లు పంపిణీ చేశారు. ప్రత్యేకంగా తయారు చేసిన పానీయాన్ని ముస్లిం సోదరులకు అందజేశారు. కార్యక్రమాన్ని సంస్థ అధినేత షేక్ మదీనా వల్లి పర్యవేక్షించారు.

గంటాకు టిక్కెట్‌పై టిడిపి శ్రేణుల హర్షం

ఆనందపురం కూడలిలో గంటాను అభినందిస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి - ఆనందపురం: భీమిలి ఎమ్మెల్యే టిక్కెట్‌ను గంటా శ్రీనివాసరావుకు ఖరారు చేయడంతో ఆ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని తర్లువాడలో శుభకార్యానికి హాజరైన గంటా శ్రీనివాసరావు అక్కడ ఉండగానే పార్టీ అధిష్టానం టిక్కెట్ ఖరారు చేస్తూ ప్రకటించడంతో పలువురు నేరుగా గంటాకు అభినందనలు తెలిపారు. ఆనంద పురం కూడలిలో గంటా శ్రీనివాసరావును గజమాలతో స్వాగతం పలికారు. బోని మాజీ సర్పంచ్ సూరాల సత్యవరప్రసాద్, చందక మాజీ సర్పంచ్ పాండ్రంగి అప్పలరాజు, పోతిన గోవిందరావు, మాజీ సర్పంచ్ బాలి అయ్యప్ప, బంకు రాజు, కాళ్ల నగేష్ ఎండాడ గోపి, మాజీ జెడ్‌పిటిసి బమ్మిడి ఉమ, సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.

భీమునిపట్నం : భీమిలి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా బిజెపి, జనసేన, టిడిపి కూటమి తరఫున టిడిపి నేత గంటా శ్రీనివాసరావు పేరును అధిష్టానం ప్రకటించడంతో పార్టీ శ్రేణుల్లో హర్షం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం గంటా క్యాంప్ కార్యాలయం వద్ద పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి, యరబాల కృష్ణవేణి,నాయకులు అనిల్ ప్రసాద్, ఎం సంజీవ్‌కుమార్, ఎస్ జోగారావు, జి పోలిరాజు, పి లక్ష్మీకుమారి, డి వెంకటేష్ పాల్గొన్నారు

పద్మనాభం : భీమిలి ఎమ్మెల్యే టిక్కెట్ గంటా శ్రీనివాసరావుకు ప్రకటించిన సమాచారం తెలిసిన వెంటనే మండలంలోని పలు గ్రామాల నుంచి టిడిపి శ్రేణులు, గంటా అభిమానులు పద్మనాభం జంక్షన్ చేరుకుని సంబరాలు జరుపుకున్నారు.పద్మనాభం జంక్షన్‌లోని ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద బాణసంచా కాలుస్తు సందడి చేశారు. వచ్చే ఎన్నికల్లో భీమిలిలో టిడిపి జయకేతనం ఖాయమని, గంటా శ్రీనివాసరావు మంచి మెజార్టీతో గెలుస్తారని వేడుక జరుపుకున్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కాళ్ల సత్యనారాయణ, కాళ్ల శ్రీను, ఆర్ సన్యాసిరావు పాల్గొన్నారు.

పిఎం పాలెం: భీమిలి ఎమ్మెల్యే టికెట్ గంటా శ్రీనివాసరావుకు రావడంతో 6వ వార్డు పిఎం పాలేనికి చెందిన టిడిపి నేతలు శుక్రవారం గంటా నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. గారె గురునాథ్, రెడ్డి సత్యనారాయణ, రామకృష్ణ, కొరగంజి సూరిబాబు, బాబ్జీ, పోతిన రమణ తదితరులు వెళ్లి గంటాను కలిసి అభినందనలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

మాట్లాడుతున్న సంఘం జిల్లా అధ్యక్షుడు అరుణ్‌కుమార్

ప్రజాశక్తి -పద్మనాభం : విద్య, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి, విద్యారంగ ప్రగతి, సమాజశ్రేయస్సుకు నిరంతరం పోరాటం చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయసంఘం నేతలు నిర్ణయించారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. సంఘం జిల్లా అధ్యక్షులు అవనాపు అరుణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఎస్‌ను రద్దుచేసి, పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించాలని, ఉపాధ్యాయ పెట్టిన సిపిఎస్ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, పెండింగ్‌లో ఉన్న అన్ని ఆర్థికపరమైన అంశాలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశానికి పరిశీలకులుగా రాష్ట్ర కార్యదర్శి శ్రీరామ్ నాయుడు. హాజరు కాగా, జిల్లా ప్రధాన కార్యదర్శి త్రినాథమూర్తి, జిల్లా కోశాధికారి. ఎంఎన్‌వి విశ్వనాథ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రామారావు, జిల్లా గౌరవాధ్యక్షులు కాళ్ల గోపీనాథ్, జిల్లా కార్యవర్గ సభ్యులు మామిడి కరుణకుమార్, సూరల అచ్చిబాబు, ఎ.సురేష్, వి.సతీష్, యు.గణేష్, పద్మనాభం మండల కార్యదర్శి ఎంజేష్ నారాయణరావు, కనకాల సన్యాసినాయుడు పాల్గొన్నారు.

బొగ్గు లారీ బీభత్సం

- లంకెలపాలెం కూడలిలో ట్రాక్టర్‌ను ఢీకొన్న వైనం
- కారుపైకి దూసుకెళ్లిన ట్రాక్టర్
- 9 మందికి తీవ్ర గాయాలు
- బొగ్గు లారీలతో ప్రజలు బెంబేలు

ప్రజాశక్తి -పరవాడ

పరవాడ మండల పరిధి జివిఎంసి 79వ వార్డు లంకెలపాలెం కూడలిలో శుక్రవారం ఓ బొగ్గులారీ బీభత్సం సృష్టించింది. బొగ్గులారీ ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో, ఆ ట్రాక్టర్ ఎదురుగా ఉన్న కారుపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంతో 9 మంది తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు, స్థానికులు తెలియజేసిన వివరాలు ప్రకారం... గంగవరం పోర్టు నుండి హిందూజా పవర్ ప్లాంట్‌కు శుక్రవారం మధ్యాహ్నం బొగ్గులోడుతో వెళ్తున్న ఏపీ 20వై 7376 నెంబర్ లారీ లంకెలపాలెం జంక్షన్ వద్దకు రాగానే అకస్మాత్తుగా ఎదురుగా ఉన్న ట్రాక్టర్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ ఎదురుగా ఉన్న కారుపైకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో మరో కారును, మూడు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టాయి. బొగ్గు లారీ ముందు భాగం, కారు నుజ్జునుజ్జు అయ్యాయి. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ బ్రా గ్లాల్‌కు కాలు విరిగింది. ట్రాక్టర్ డ్రైవర్ ఎ.శ్రీనివాసరావు, కారుల్లోనూ, ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తున్న 9 మంది తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిలో లారీ డ్రైవర్, ట్రాక్టర్ డ్రైవర్‌తో పాటు చీడికాడ మండలం చుక్కపల్లి గ్రామానికి చెందిన కోటయ్య, వెంకటరావు, ఇంకా కె.సంతోష్, డి.శ్రీనివాస్‌రాజు తదితరులు ఉన్నారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు విషయమై పోలీసులను ప్రజాశక్తి సంప్రదించే ప్రయత్నం చేయగా, పోలీసులు ఫోన్ లిఫ్ట్ చేయలేదు.

బొగ్గు లారీలతో ప్రజలు బెంబేలు

హిందూజా పవర్ ప్లాంట్‌కు బొగ్గు తరలిస్తున్న లారీ వల్ల లంకెలపాలెం, పరవాడ ప్రాంతం ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఈ లారీలు ఎప్పుడు ఎవరిని ఢీకొడతాయో, ఏ ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు బిక్కుబిక్కుమంటూ రోడ్డుపైకి వస్తున్నారు. బొగ్గులారీ వల్ల గతంలోనూ అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. 2023 అక్టోబర్ 20న పరవాడ తహశీల్దార్ కార్యాలయం దగ్గరలో ఉన్న చెత్త నుండి సంపద కేంద్రం ఎదురుగా గొర్రెల మందపై బొగ్గు లారీ దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో 32 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. మరో 15 జీవాలకు కాళ్లు విరిగిపోయాయి. అలాగే ఫార్మసిటీలోని పరవాడ డిఎస్‌పి ఆఫీసు దగ్గర్లో 2023 నవంబర్ 24న బొగ్గు లారీని అక్రమంగా రోడ్డుపై ఉంచడంతో లారస్ బస్సు దానిని ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న ఒక వ్యక్తి దుర్మరణం చెందారు. పలువురికి గాయాలయ్యాయి. ఈ ప్రాంతంలో బొగ్గు లారీల వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నా, పోలీసులుగాని, ట్రాన్స్‌పోర్టు డిపార్ట్మెంట్ వారు గాని అధిక లోడుతో ప్రయాణం చేసే లారీలపై చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా పోలీస్, ట్రాన్స్‌పోర్టు డిపార్ట్మెంట్ అధికారులు తక్షణమే బొగ్గు లారీలపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

కారుపైకి దూసుకెళ్లిన ట్రాక్టరు

ముందుభాగం నుజ్జు నుజ్జు అయిన బొగ్గు లారీ

బొగ్గులారీ ఢీకొట్టి ధ్వంసమైన ద్విచక్ర వాహనం

82వ వార్డులో ప్రచారం చేస్తున్న వైసిపి నేతలు

వైసిపి అభ్యర్థి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ శుక్రవారం జీవీఎంసీ 82వ వార్డులో కార్పొరేటర్ మందపాటి సునీత జానకిరామరాజు ఆధ్వర్యంలో అంజి కాలనీలో ప్రచారం నిర్వహించారు. ముందుగా గాంధీనగర్ శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంజయ్య కాలనీలో ప్రజలు భరత్ కుమార్‌కు పూల వర్షంతో స్వాగతం పలికారు. ఆయన ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గడిచిన ఐదు సంవత్సరాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేశారన్నారు. అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, ఎమ్మెల్యేగా తాను పోటీ చేస్తున్నామని, మే 13 జరగబోయే ఎన్నికల్లో ఎంపీ, ఎమ్మెల్యే ఓట్లు ఫ్యాను గుర్తుపై వేసి గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యేగా తనకు ఒక అవకాశం ఇస్తే అనకాపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు జాజుల రమేష్, ఆకుల సంతోష్, అల్లు మల్ల జయరాం, కోడూరు అప్పారావు, సంబారి అప్పారావు, అండి బోయిన మోహన్, బుద్ద రాంబాబు, కోడూరు శ్రీను, నూతి తాతబాబు, ఏడవకల నూకమ్మ, మెల్లిపాకదుర్గ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వాలంటీర్లను చూస్తే టిడిపి నేతల గుండెల్లో రైళ్లు

ప్రజాశక్తి-దేవరాపల్లి

మాట్లాడుతున్న అనురాధ

రాష్ట్రంలోని గ్రామ, వార్డు వాలంటీర్లను చూస్తే చంద్రబాబుతో పాటు తెలుగుదేశం పార్టీ నేతల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని మాడుగుల నియోజకవర్గం వైసిపి అభ్యర్థి ఈర్లె అనురాధ అన్నారు. అందువల్లే వాలంటీర్లపై చంద్రబాబు నాయుడు, ఆ పార్టీ నేతలతో పాటు దత్తపుత్రుడి నోట్లో నుంచి కించపరిచే మాటలు వినపడుతున్నాయని తెలిపారు. శుక్రవారం తారువలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మహిళల అద్యశ్యానికి వాలంటీర్లు కారణమని, తనకు అధికారం ఇస్తే వాలంటీర్ల వ్యవస్థ నడుం విరగ్గొడతానని, వారి కథ తేలుస్తామని బెదిరింపులకు దిగడం హాస్యాస్పదమన్నారు. వివక్షల వారి జేబులు నిండడం లేదు కాబట్టే వారి కడుపులు మండుతున్నాయని పేర్కొన్నారు. టిడిపి నేతల జేబులు గతంలో మాదిరిగా నిండటం లేదు కాబట్టి ఆ పార్టీ నేతల గుండెలు మండుతున్నాయని, అందుకే వాలంటీర్లపై అక్కసు వెళ్లగక్కుతూ నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. వాలంటీర్లను ఉగ్రవాదులు, జిహాదీలు, స్లీపర్ సెల్స్‌తో పోల్చుతూ అత్యంత అవమానకరంగా మాట్లాడటం దారుణమన్నారు. కోవిడ్ సమయంలో తెలుగుదేశం పార్టీ నేతలు హాయిగా నిద్రపోతూ ఇళ్లకే పరిమితమైతే, వాలంటీర్లు రాష్ట్ర వ్యాప్తంగా గడప గడపకూ సేవలందించిన విషయం గుర్తు చేసుకోవాలని కోరారు. అంత గొప్ప సేవచేసిన వాలంటీర్లపై టీడీపీ నేతలు ఈ రకంగా మాట్లాడటం సిగ్గుచేటని అసహనం వ్యక్తం చేశారు.

పోలీసు చెక్ పోస్టు వద్ద సూచనలు ఇస్తున్న ఎస్‌పి మురళీకృష్ణ

పోలీసు చెక్ పోస్ట్‌ను తనిఖీ చేసిన ఎస్‌పి

ప్రజాశక్తి- పరవాడ : పరవాడ మండలం, దేశపాత్రునిపాలెం వద్ద ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్ట్‌ను జిల్లా ఎస్పీ కెవి.మురళీకృష్ణ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బంది, కేంద్ర పోలీస్ దళాలు సంయుక్తంగా వాహన తనిఖీలు విస్తృతం చేయాలని, డబ్బు, మద్యం, నాటు సారా, గంజాయి అక్రమ రవాణా అరికట్టేందుకు, ఉచిత కానుకలు పంపిణీని నిరోధించేందుకు పటిష్ట తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని చిప్పాడ, దివీస్ ల్యాబొరేటరీ జనరల్ మేనేజర్ ఎంఎస్ఎన్ రావు అన్నారు. దివీస్ ఆధ్వర్యంలో చిప్పాడలో నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌లో టైలరింగ్ కోర్సులో శిక్షణ పొంది. నైపుణ్యం ఉన్న వారికి ఎంఎస్ఎన్ రావు శుక్ర వారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సిఎస్ఆర్ మేనేజర్ డి సురేష్‌కుమార్, సిఎస్ఆర్ ప్రతినిధులు ఎ శ్రీనివాస్, కె నరసింహ, పి శేఖర్‌బాబు పాల్గొన్నారు

శిక్షణ పొందిన సర్టిఫికెట్లతో మహిళలు

టిడిపి, జనసేన, బిజెపి శ్రేణుల బైక్ ర్యాలీ

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి నియోజకవర్గం బిజెపి, జనసేన, టిడిపి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కూటమి నుండి అనకాపల్లి ఎంపీగా పోటీ చేస్తున్న బిజెపి నేత సీఎం రమేష్ మొట్టమొదటిసారిగా అనకాపల్లి విచ్చేస్తున్న సందర్భంగా ఆయనకు స్వాగతం పలికేందుకు ఏర్పాటు చేసిన ఈ బైక్ ర్యాలీని రామకృష్ణ ప్రారంభించారు. సుమారు వెయ్యికి పైగా ద్విచక్ర వాహనాలతో ఈ ర్యాలీ సాగింది. రింగ్ రోడ్‌లోని జనసేన పార్టీ కార్యాలయం నుండి గవరపాలెం గుండా నూకాంబిక ఆలయానికి చేరుకుంది. అనంతరం వేల్పుల వీధి గౌరి పరమేశ్వరుల ఆలయం వద్దకు వెళ్లి అక్కడ నుండి నెహ్రూ చౌక్, ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా జీఎంజీ పాఠశాల వద్ద ఉన్న బహిరంగ సమావేశ ప్రాంతానికి చేరుకుంది. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గొంతుని శ్రీనివాసరావు, మళ్ల సురేంద్ర, కొరిబిల్లి పరి, ఎం సంతోష్, జనసేన, టిడిపి, బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

కశింకోట నుండి ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి, జనసేన నాయకులు

కశింకోట : అనకాపల్లిలో జరిగిన కార్యక్రమానికి మండలంలోని టిడిపి, జనసేన నాయకులు ర్యాలీగా శుక్రవారం వెళ్లారు ఉమ్మడి అభ్యర్థులు కొణతాల రామకృష్ణ, సీఎం రమేష్‌ను గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి గొంతుని శ్రీనివాసరావు, నైనంశెట్టి రమణారావు, వుల్లింగల రమేష్, కూండ్రపు అక్కు నాయుడు, జన సేన నాయకులు కర్రి గోవింద తదితరులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : అనకాపల్లి బిజెపి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్‌కు స్వాగతం పలకడానికి టిడిపి, జనసేన నాయకులు అధిక సంఖ్యలో బయలుదేరి వెళ్లారు. టిడిపి చోడవరం అభ్యర్థి కేఎస్ఎన్ఎస్ రాజు, నాయకులు బత్తుల తాతయ్య బాబు, గునూరు మల్లునాయుడు ఆధ్వర్యంలో కార్యకర్తలు నాయకులు తరలివెళ్లారు.

ప్రజలను మోసగిస్తున్న వైసిపిని ఓడించాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు : ఐదేళ్లగా ప్రజలను మోసగిస్తూ పాలన సాగిస్తున్న వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని సాగనంపాల్సిన తరుణం ఆసన్నమైందని దంతులూరి చిరంజీవి రాజు అన్నారు. వైసిపి నుండి తెలుగుదేశం పార్టీలో చేరిన చిరంజీవి రాజు శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు విజన్‌కు, జగన్మోహన్ రెడ్డి మోసపు మాటలకు చాలా తేడా ఉందని చెప్పారు. సంక్షేమం పేరిట తాయిలాలు పంచుతూ అప్పుల రాష్ట్రంగా మార్చారన్నారు. రాజధాని లేని రాష్ట్రంగా చేశారన్నారు. రైతులకు వరప్రసాదిని అయిన పోలవరం ప్రాజెక్టును పక్కన పడేసారని పేర్కొన్నారు. రాష్ట్రంలో బ్రాందీ షాపులను పూర్తిగా నిషేధించి ఎన్నికలకు వెళ్తానని ఆనాడు ప్రజలకు ఇచ్చిన మాట ఏమైందని ప్రశ్నించారు. మాడుగుల నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీలోకి మరిన్ని చేరికలు ఉంటాయని చెప్పారు.

మాట్లాడుతున్న చిరంజీవిరాజు

ఘనంగా టిడిపి ఆవిర్భావ దినోత్సవం



బూడి ముత్యాలనాయుడును సత్కరిస్తున్న భరత్‌కుమార్

ఎంపీ అభ్యర్థి బూడిని కలిసిన భరత్‌కుమార్

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి వైసిపి ఎంపీ అభ్యర్థిగా ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడుని ఆ పార్టీ అధిష్టానం ప్రకటించిన నేపథ్యంలో శుక్రవారం అనకాపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో అమలుపరిచిన సంక్షేమ పథకాలే తమను తిరిగి అధికారంలోకి తెస్తాయని తెలిపారు. కార్యక్రమంలో చోడవరం శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ, అనకాపల్లి ఏఎంసీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, గవర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బొడ్డేడ శివ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాగజగదీష్ తదితరులు

ప్రజాశక్తి- అనకాపల్లి

తెలుగుదేశం పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు మాట్లాడుతూ పేదవాడి ఆకలి మంటల్లో నుంచి టిడిపి పుట్టిందని, ఆవిర్భావం నుండి స్పష్టమైన సిద్ధాంతాలు, విధానాలతో ముందుకు వెళ్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ శాఖ అధ్యక్షులు డాక్టర్ కెకెవిఎ.నారాయణరావు, నాయకులు బొలిశెట్టి శ్రీనివాసరావు, కోట్ని బాలాజీ, ధనాల విష్ణుచౌదరి, కొణతాల రత్నకుమారి, కుప్పిలి జగన్, బోడి వెంకటరావు కడిమిశెట్టి నర్సింగరావు, మల్ల గణేష్, బొడ్డేడ మురళి, కాండ్రేగుల సత్యనారాయణ, కాండ్రేగుల ముకుంద, పొలిమేర నాయుడు, దూలం ప్రసాద్, కర్రి మల్లేశ్వరరావు, మారిశెట్టి శంకర్రావు, వేదుల సూర్యప్రభ, శంకర్ల పద్మలత, షేక్ రియాజ్, కేబుల్ రమేష్, గుర్రాల వాసు, పెతకంశెట్టి వెంకటరావు, తగరంపూడి శ్రీనురాజు, చెక్కల శ్రీను, బిజెపి పార్లమెంట్ అభ్యర్థి సీఎం రమేష్ సోదరుడు చింతలపూడి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్ల : తెలుగుదేశం పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవం మండలంలో ఎక్కడా కాన రాలేదు. మండల వ్యాప్తంగా టిడిపి గ్రామ గ్రామాన విస్తరించి ఉన్నా పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఎక్కడా జరపక పోవడం పట్ల పార్టీ శ్రేణుల్లో తీవ్ర నిరాశ నెలకొంది. సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కూడా ఆవిర్భావ దినోత్సవం జరపక పోవడం విడ్డూరంగా ఉందని మండల పార్టీ నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి మండలంలో గ్రూపు రాజకీయాలు కారణమని పలువురు చర్చించు కుంటున్నారు.

భీమునిపట్నం : టిడిపి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక పార్టీ కార్యాలయం వద్ద ఆ పార్టీ జెండాలను శుక్రవారం సీనియర్ నాయకులు చురకల రమణ, ఎంవి గురుమూర్తి, చిలకా నరసింగరావు ఆవిష్కరించారు. పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, పార్టీ నాయకులు చోడిపల్లి సాయి జయశంకర్, జోగ సన్యాసిరావు, గరే సదానంద పాల్గొన్నారు

సీతమ్మధార : తెలుగుదేశం పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను 26వ వార్డు పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు . టిడిపి, జనసేన, బిజెపి కూటమి నేతలు పాల్గొని ఎన్‌టిఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. రానున్న ఎన్నికల్లో ఉత్తర ఎమ్మెల్యేగా విష్ణుకుమార్‌రాజును, విశాఖ ఎంపీగా శ్రీభరత్‌ను గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.కార్యక్రమంలో 26వ వార్డు కార్పొరేటర్ ముక్కా శ్రావణి, టిడిపి అధ్యక్షుడు ముక్కా కిషోర్‌కుమార్, జనసేన నేత శ్రీధర్ పాల్గొన్నారు.

జివిఎంసి 26వ వార్డు కార్యాలయంలో జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

గోపాలపట్నం : విశాఖ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే, రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పి.గణబాబు ఆధ్వర్యంలో టిడిపి 42వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. కేకు కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో టిడిపి కార్పొరేటర్లు దాడి వెంకట రమేష్, బొమ్మిడి రమణ, టిడిపి, జనసేన, బిజెపి నేతలు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

భీమిలిలో టిడిపి జెండాను ఆవిష్కరిస్తున్న గురుమూర్తి తదితరులు

గోపాలపట్నంలో జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

బెల్లాన్ని పులబెట్టే డ్రమ్స్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు

3,500 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం

ప్రజాశకి-దేవరాపల్లి

మండలంలోని రైవాడ జలాశయం సమీపంలో గల బొడ్డపాడు ప్రాంతంలో స్థానిక ఎస్సై డి.నాగేంద్ర తన సిబ్బందితో కలిసి శుక్రవారం నాటు సారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడిలో 3,500 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశారు. నాటు సారా తయారీకి ఉపయోగించిన 15 ప్లాస్టిక్ డ్రమ్ములను సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగేంద్ర తెలిపారు. ఎవరైనా నాటుసారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు

ప్రజాశక్తి-అనకాపల్లి

ఉత్తరాంధ్ర ఇలివేలుపు శ్రీనూకంబిక అమ్మవారి దేవస్థానంలో ఏప్రిల్ 7 జాతర, 8 కొత్త అమావాస్య సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు ఆలయ సహాయ కమిషనర్ బండారి ప్రసాద్ తెలిపారు. బాలాలయం మండపంలో శుక్రవారం భక్తుల సమక్షంలో జాతర గోడపత్రికలు, కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన తెలియజేశారు.

పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

తారెత్తిస్తున్న ఎండలు

- ఉష్ణ తాపానికి జనం ఉక్కిరిబిక్కిరి
- వేసవి తొలిరోజుల్లోనే భానుడి భగభగ
- నిర్మానుష్యంగా రోడ్లు

నిర్మానుష్యంగా ఉన్న తగరపువలస మెయిన్ రోడ్డు

ప్రజాశక్తి -తగరపువలస

ఎండలు మండిపోతున్నాయి ఎండల తీవ్రతకు స్థానిక జంక్షన్‌తోపాటు ప్రధాన రహదారి నిర్మానుష్యంగా మారింది. సాధారణంతో పోలిస్తే రెండు, మూడు డిగ్రీలు అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎల్‌నినో ప్రభావం జూన్ వరకు ఉంటుందని వాతావరణ శాఖ అంచనాలు వేస్తుండగా,వచ్చే రెండు నెలలు భానుడి భగభగలు తప్పవని నిపుణులు అంటున్నారు. వేసవి తొలిరోజుల్లోనే ఎండల తీవ్రతకు ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. నిత్యం జన సమ్మర్థంతో రద్దీగా ఉండే జంక్షన్ ఉష్ణోగ్రతలు, వడగాలులు తీవ్రతకు నిర్మానుష్యంగా ఉంది. ఎండల తీవ్రతకు రోడ్డు పక్కన పండ్లు, కూరగాయల వ్యాపారులు గొడుగులు వేసుకుని కనిపించారు. ఎండ వేడిమి నుంచి బయట పడేందుకు టోపీలు పెట్టుకుని, గొడుగులు వేసుకుని, స్కార్ఫ్‌లు తలపై కట్టుకుని మోటారు బైక్‌లపై ప్రయాణిస్తుండ డం కనిపించింది. మహిళలు, వృద్ధులు ఉదయం పదిగంటల దాటకముందే రోడ్డు ఎక్కేందుకు భయపడుతున్నారు. మండుతున్న ఎండలతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. అత్యవసరమైతేనే తప్ప మధ్యాహ్న వేళ ప్రజలు బయటకు రావడం మంచిది కాదని, ఒకవేళ తప్పనిసరై రావాల్సి వస్తే ఎండల వేడిమి నుంచి రక్షణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎండల వేడిమి నుంచి ఉపశమనానికి కొబ్బరిబోండాలు, శీతలపానీయాలను ప్రజలు ఆశ్రయిస్తుండడంతో వాటి అమ్మకాలు క్రమేణా పెరుగుతున్నాయి.

నేడు టిడిపి మండల అత్యవసర సమావేశం

ప్రజాశక్తి - పరవాడ : మండలంలోని వెన్నెలపాలెంలో తెలుగుదేశం పార్టీ మండల అత్యవసర సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్టు టిడిపి మండల అధ్యక్షులు వియ్యపు చిన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ మంత్రి, పెందుర్తి నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ బండారు సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఈ సమావేశానికి టిడిపి క్లస్టర్ ఇన్‌చార్జులు, యూనిట్ ఇన్‌చార్జులు, 282 బూత్ ఇన్‌చార్జులు, కేఎస్‌ఎస్ మెంబర్స్ తప్పనిసరిగా హాజరై ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

దుర్గాలమ్మ ఆలయ అభివృద్ధికి విరాళం

ప్రజాశక్తి - పరవాడ

మండలంలోని గోర్లివానిపాలెం పంచాయతీ పరిధి దిబ్బల గోర్లివానిపాలెం గ్రామానికి చెందిన అంజన ఎంటర్‌ప్రైజెస్ పాల్‌జీ బ్రిక్స్ కంపెనీ యజమాని పోలిరెడ్డి దేముడు సన్యాసమ్మ దంపతులు, రావాడ పంచాయితీలోని దుర్గాలమ్మ అమ్మవారి ఆలయం అభివృద్ధికి రూ.5,117 విరాళం అందజేశారు. ఈ మేరకు ఆలయ కమిటీకి ఈ మొత్తాన్ని శుక్రవారం అందించారు. ఆలయ అభివృద్ధికి సహకరించిన దేముడు, సన్యాసమ్మ దంపతులకు ఆలయం కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.



విరాళం అందజేస్తున్న పోలిరెడ్డి దేముడు, సన్యాసమ్మ దంపతులు

అరకొర సౌకర్యాలతో జగనన్న కాలనీ

ప్రజాశక్తి-రోలుగుంట: మండలంలోని కుసర్లపూడి గ్రామంనకు ఆనుకొని ఉన్న మెట్టుపై 34 మందికి జగనన్న కాలనీ వాసులు స్థలాలు పంపిణీ చేశారు. వారిలో కొంత మంది ఇళ్లు నిర్మాణం పూర్తి చేసి గృహ ప్రవేశం కూడా చేయడం జరిగింది. అయితే వీరు ప్రారంభం నుండి రహదారి, తాగునీరు, కరెంట్ సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మెట్టపై నిర్మాణం చేయడంతో రోడ్డు సదుపాయం కల్పించడంలో అటు అధికారులు ఇటు రాజకీయ నాయకులు విఫలమయ్యారు. జగనన్న కాలనీ లేఅవుట్ వేయకంటే ముందు ఆ ప్రాంతాన్ని చదును చేయాలి. అలా కాకుండా ఇళ్ల నిర్మాణం ప్రారంభించడంతో అదనంగా ఖర్చు అయిందని లబ్ధిదారులు వాపోతున్నారు. మార్గంనకు అడగ్గా ఎన్టీఆర్ కాలనీ గతంలో నిర్మించారని, ఆ కారణంగా రహదారి నిర్మించడానికి అడ్డంకులు ఏర్పడ్డాయని సాకులు చెబుతూ అధికారులు తప్పించుకుంటున్నారు.

ఈ విషయం స్థానిక సర్పంచ్ మడ్డు అప్పలనాయుడు మండల సర్వసభ్య సమావేశంలో నాలుగైదు సార్లు మెత్తుకున్నా రహదారి వేయడానికి నిధులు లేవని అధికారులు చేతులెత్తేశారు. ఎలక్ట్రిషన్ అధికారులు స్తంభాలు ఏర్పాటు చేయడానికి, గోతులు తవ్వడానికి మెట్టపై వీలు కుదరలేదని, అలాగే వాటర్ ట్యాంక్ కూడా మధ్యలోనే నిలిపివేశారు. ఇలా అరకొర సౌకర్యాలతో పలువురు లబ్ధి దారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

కాలనీలో ఇరుకుగా ఉన్న రహదారి

మధ్యలో నిలిచిన వాటర్ ట్యాంక్

కనీస సౌకర్యాలు ఏవీ?

జగనన్న కాలనీ అంటే అన్ని సౌకర్యాలతో ఏర్పాటు చేస్తామని అధికారులు చెప్పారు. కనీసం రహదారి, కరెంట్, తాగునీరు సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నాం. తాగునీటి కోసం రెండు కిలో మీటర్లు వెళ్లాల్సి వస్తుంది. ఇప్పటికైనా సమస్యలను పరిష్కరించాలి.

సబ్బవరపు రాజులమ్మ
లబ్ధిదారురాలు

ఎన్నో ప్రయాసలతో ఇంటి నిర్మాణం

మెటీరియల్ పిక్క, ఇనుము, సిమెంట్, ఇసుక అన్ని కింది నుండి మెట్ట మీదకు మోసుకొని నిర్మించుకున్నాం. తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు న్యాయం చేయాలి.

సబ్బవరపు సత్యవతి
లబ్ధిదారురాలు

భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

నర్సీపట్నంలో ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: నర్సీపట్నం మున్సిపాలిటీ పెదబొడ్డేపల్లి ఆర్‌సిఎం చర్చ్ ఫాదర్ సౌరీబాబు ఆధ్వర్యంలో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెదబొడ్డేపల్లి థెరిస్సా కాలనీ నుంచి ఇంద్రకాలనీ తదితర పుర వీధుల్లో గుడ్ ఫ్రైడే విశిష్టతను తెలియజేస్తూ పాటలు పాడుతూ ర్యాలీ చేపట్టారు. అనంతరం చర్చిలో ఉపవాస ప్రార్థనలు జరిగాయి.

కోటవురట్ల: మండల వ్యాప్తంగా క్రైస్తవ సోదరులు శుక్రవారం గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కోటవురట్ల, బికేపల్లి, ఎండపల్లి, పాములవాక సహా పలు గ్రామాలలో పెద్ద సంఖ్యలో చర్చిల్లో మత పెద్దలు ఏసు శిలువకు సంబంధించి ఏడు విషయాలను వివరించారు.

కొత్తకోట: రావికమతం మండలంలో గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రైస్తవ భక్తులు ఉదయం నుంచే చర్చ్‌లకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేసారు. కొత్తకోట ఆర్‌సిఎం చర్చ్‌లో ఫాదర్ అజయ్ కుమార్ ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా జరిగాయి. కొత్తకోట గ్రామ ఆర్‌సిఎం సంఘ సభ్యుల తో పాటు, రోలుగుంట, జెడ్. కొత్తపట్నం, దొండపూడి, ధర్మవరం, కిత్తంపేట గ్రామాల క్రైస్తవ సోదరులు పలువురు పాల్గొన్నారు.

సీతమ్మధార : విశాఖ ఉత్తర నియోజకవర్గం, జివిఎంసి 43వ వార్డు శ్రీనివాసనగర్‌లో శుక్రవారం గుడ్ ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జీసస్ హోలీ స్పిరిట్ ఫైర్ మినిస్ట్రీస్ డాక్టర్ కెఎ డానియల్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వేడుకల్లో విశాఖ ఉత్తర నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె రాజు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు బాణాల శ్రీనివాసరావు పాల్గొన్నారు. క్రిస్టియన్లకు గుడ్‌ఫ్రైడే శుభాకాంక్షలు తెలిపారు.

కొత్తకోటలో ప్రార్థనలు చేస్తున పాస్టర్లు

గ్రామాల్లో జోరుగా ఎన్నికల సర్వేలు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఇంకా నామినేషన్ల ఘట్టం ప్రారంభం కాలేదు. అప్పుడే గెలువు ఎవరిదంటూ సర్వేలు జోరందుకున్నాయి. పలు సంస్థల సభ్యులు గ్రామాలు, వార్డుల్లో పర్యటిస్తూ ప్రజానాడి తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. యువత దగ్గర నుంచి వృద్ధుల వరకు కులాల వారిగా అభిప్రాయాలను సేకరిస్తున్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ఉత్తరాదికి చెందిన ఏజెన్సీలు రంగంలోకి దిగాయి. అనేక ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుని క్షుణ్ణంగా సర్వే చేస్తున్నారు. ఓ వైపు ఆభ్యర్థుల ప్రచారం, మరోవైపు సర్వేలకు దిగడంతో ప్రజలు ఇప్పటి నుంచే ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కొందరు ఏమి చెప్పకుండా దాటేస్తుంటే.. మరికొందరు వారి అభిప్రాయాలను బల్లగుద్ది మరీ వెల్లడిస్తున్నారు. ఈసారి మారుమూల గ్రామాలకు వెళ్లి అభిప్రాయాలను తెలుసుకోవడం గమనార్హం.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల కల్పన

ఎన్నికల రిటర్నింగ్ అధికారి గీతాంజలి

ప్రజాశక్తి -నక్కపల్లి: ఎలక్షన్ కమిషన్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పాయకరావుపేట నియోజక వర్గంలో నాలుగు మండలాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను శనివారం నుండి పున్ణపరిశీలన చేయనున్నట్లు పాయకరావుపేట నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారికి కె.గీతాంజలి తెలిపారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ, పాయకరావుపేట నియోజకవర్గంలోని కోటవురట్ల మండలంలో 52, పాయకరావుపేట మండలంలో 90, నక్కపల్లి మండలంలో 75, ఎస్.రాయవరం మండలంలో 75 మొత్తం 292 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఇప్పటికే పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. మరోసారి పోలింగ్ కేంద్రాలను పున్ణపరిశీలించి ఏమైనా అసౌకర్యాలు ఉంటే గుర్తించి, వాటిని సరి చేయనున్నట్లు తెలిపారు. పాయకరావుపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ప్రత్యేక చెక్ పోస్టులు ఏర్పాటు చేయడం జరిగిందని, నిరంతరం తనిఖీలు ఉంటాయన్నారు. నియోజవర్గంలో అన్ని గ్రామాల్లోనూ ఎన్నికల కోడ్ పక్కాగా అమలవుతుందన్నారు.

కొత్త అమావాస్య జాతరకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: నర్సీపట్నం అబీద్ సెంటర్ లోని నూకాలమ్మ ఆలయంలో కొత్త అమావాస్య జాతర ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవాదాయ శాఖ కార్యనిర్వాహణాధికారి గంగారావు తెలిపారు. ఏప్రిల్ 2వ తేదీన మొదటి జాగారం, 4న రెండో జాగారం, 7న పెద్ద జాగారం నిర్వహిస్తామని చెప్పారు. 8న కొత్త అమావాస్య పండుగ జరపనున్నాయని ఆయన వివరించారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: గొలుగొండ కెవీ 33/11 కేవీ బలిఘట్టం సబ్ స్టేషన్‌లో గల ఏటిగైరంపేట ఫీడర్ పరిధిలో ఈనెల 30న శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని నర్సీపట్నం డివిజనల్ ఇంజనీర్ వీడీవీ.రామకృష్ణ శుక్రవారం తెలిపారు. లైన్, సబ్ స్టేషన్ మరమ్మత్తుల నేపథ్యంలో చీడిగుమ్మల, అయ్యన్నపాలెం, గుండుపాల, గొలుగొండ, పప్పుశెట్టిపాలెం, యర్రవరం, జోగుంపేట, చిన్నయ్యపాలెం, శ్రీరాంపురం, కొత్తమల్లంపేట, చోద్యం, కేడిపేట గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. కావున వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రజా సమస్యలపై పోరాడే

సిపిఎం అభ్యర్థులనే గెలిపించాలి

ప్రజాశక్తి -అనంతగిరి: గిరిజన హక్కులు, చట్టాల పరిరక్షణకు నిరంతరం పోరాడే సీపీఎం బలపర్చిన అరకు అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థులకే ఓటు వేసి గెలిపించాలని కోరుతూ శుక్రవారం లంగుపర్తి పంచాయతీలో జన్ని భీమన్న ఆధ్వర్యాన సమావేశం నిర్వహించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న వివిధ గ్రామాల నుండి ప్రజలను ఉదేశించి సీపీఎం మండల కార్యదర్శి ఎస్.నాగులు మాట్లాడుతూ, జీవో 3 సాధించాలంటే సీపీఎం అభ్యర్థిలను గెలిపించాలని కోరారు. గిరిజన హక్కుల కోసం పోరాటం చేస్తున్న ఏకైక పార్టీ సిపిఎం అని ఆయన అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అన్యాయం చేసిన బీజేపీ పార్టీతో కుమ్మక్కై పరోక్షంగా పొత్తు పెట్టుకున్న వైసీపీని కూడా ఓడించాలని పిలుపు నిచ్చారు. నిరంతరం ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తున్న సీపీఎం అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టోకూరు సీపీఎం సర్పంచ్ కిల్లో. మోస్య, సీపీఎం నాయకులు జన్ని భీమన్న, వార్డు మెంబర్ జన్ని .సుబ్బారావు, గెమ్మెల దేముడు, కుమార్, శివాజీ, రామన్న, పాల్గొన్నారు.

ప్రచారం చేపడుతున్న నాయకులు

మంటలను ఆర్పుతున్న రైతులు

13 పశువుల పాకలు దగ్ధం

ప్రజాశక్తి-చీడికాడ:మండలంలోని శిరిజాం గ్రామంలో పదమూడు పశువుల పాకల దగ్ధం కాగా సుమారు 6 లక్షల 50 వేలు ఆస్తి నష్టం సంభవించింది. స్థానికుల కథనం మేరకు...శిరిజాం గ్రామంలో గుంపాన వారి కల్లాల వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో 13 పశువుల పాకలు పూర్తిగా దగ్ధమయ్యాయి. గుంపాన సింహాచలం, వెంకటరమణ, నర్సింగరావు, లక్ష్మణ, సన్యాసిరావు, దేముళ్ళు, గంగు నాయుడు, దేముడమ్మ, నాగేశ్వరరావు, ఎర్రి నాయుడు, రాము, ముసలి నాయుడు లకు చెందిన పశువుల పాకలతో పాటు వరి గడ్డి పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న మాడుగుల అగ్నిమాపక కేంద్రం సిఐ వి.రాజేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు 6 లక్షల 50 వేల ఆస్తి నష్టం సంభవించినట్లు సిఐ అంచనా వేశారు.
పంచాయతీ కార్యదర్శి పద్మ, వీఆర్వో శేఖర్‌రావు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి నష్టాన్ని అంచనా వేశారు. విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పైలా ప్రసాదరావు బాధితులను పరామర్శించి ఓదార్చారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరారు.

కూటమి టిడిపి అభ్యర్థి ఖరారు

- కిల్లు రమేష్ నాయుడును వరించిన సీటు

ప్రజాశక్తి -పాడేరు: ఎస్టీ రిజర్వుడ్ పాడేరు అసెంబ్లీ స్థానానికి కూటమి తరుపున ఎట్టకేలకు తెలుగుదేశం పార్టీకి సీటు ఖరారు అయ్యింది. శుక్రవారం సాయంత్రం పాడేరు టిడిపి అభ్యర్థిగా కిల్లు వెంకట రమేష్ నాయుడు పేరును అధిష్టానం ప్రకటించింది. పొత్తులో భాగంగా కూటమి అభ్యర్థిగా బిజెపి నుంచి అభ్యర్థిని ఎంపిక చేస్తారని ఊహాగానాలు ఇన్నాళ్లు వ్యక్తమయ్యాయి. చివరికి పాడేరు అసెంబ్లీ సీటు టిడిపి కే దక్కింది. పాడేరు మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్ కిల్లు వెంకటరత్నం తనయుడు రమేష్ నాయుడుకు టిడిపి టికెట్ వరించింది. ఆయన ఉపాధ్యాయుడిగా వృత్తిని నిర్వర్తిస్తూ ఇటీవల పదవీ విరమణ చేశారు.



అరుకు అసెంబ్లీ స్థానానికి తొలి జాబితాలోనే టిడిపి అభ్యర్థిగా దొన్నుదొరను అధిష్టానం ప్రకటించింది. అనూహ్యంగా ఈ అసెంబ్లీ సీటు రెండు రోజుల క్రితం బిజెపి అభ్యర్థిని ప్రకటించడంతో మళ్లీ పాడేరుకు టిడిపి అభ్యర్థిని కూటమి ఖరారు చేసింది దీంతో అరుకు పార్లమెంట్ నియోజకవర్గంలో అరకు అసెంబ్లీ స్థానం ఒక్కటే ఈ పార్టీకి దక్కినట్లు అయింది. అయితే అరకు, పాడేరు నియోజకవర్గాలకు గత ఐదేళ్లుగా తెలుగుదేశం పార్టీకి ఇన్చార్జిలుగా వ్యవహరించిన దొన్నుదొర, గిడ్డి ఈశ్వరికిలకు అసెంబ్లీ సీట్లు ఇవ్వకుండా అధిష్టానం జలక్ ఇచ్చింది.

వైసిపి నేతల ప్రచారం

ప్రజాశక్తి- అరకులోయ :అరకు నియోజకవర్గంలో వైసిపి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ అరకులోయ టౌన్ షిప్‌లో ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ శుక్రవారం రాత్రి ప్రచారం నిర్వహించారు. అరకు ఎంపీగా పోటీ చేస్తున్న తన కోడలు గుమ్మ తనుజరాణి, ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగంలను గెలిపించాలని అరకులోయ వర్తక సంఘం ప్రతినిధులతో సమావేశమై అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వైఎస్‌ఆర్ సీపీ నాయకులు వర్తక సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

కల్వర్టులు శిథిలం..

-ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని వైనం-మరమ్మతు పనులపై నిర్లక్ష్యం

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలంలో గ్రామీణ రహదారులు, కల్వర్టులు దెబ్బతిని ప్రమాదకరంగా మారాయి. చాలా చోట్ల కల్వర్టులకు రంధ్రాలు పడి శిథిలమై, కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. వాటి వద్ద ప్రమాదం పొంచివుంది. కల్వర్టులు దెబ్బతిన్నా వాటికి మరమ్మతులు చేపట్టలేదు.
రావికమతం- కింతలి మార్గంలో గుమ్మళపాడు పారమ్మ చెరువు వద్ద కొండ గెడ్డపై కట్టిన కల్వర్టుకు రంధ్రం పడి ప్రమాదకరంగా మారింది. చినపాచిల పంచాయతీ కార్యాలయానికి సమీపంలో మలుపు వద్ద కల్వర్టుకు రెండు వైపులా కట్టిన రక్షణ గోడలు శిథిలమయ్యాయి. ఇదే మార్గంలో కవగుంట, బుడ్డిబండ, కేబీపీ అగ్రహారం దగ్గర కల్వర్టులు శిథిలమైనాయి. చినపాచిల నుంచి కొమిర వెళ్లే రోడ్డులో సాసుబిల్లి వారి పాకలురోడ్డులో సాసుబిల్లి వారి పాకలు వద్ద కల్వర్టుకు పెద్ద రంధ్రం పడ్డంతో స్థానికులే మట్టితో తాత్కాలికంగా పూడ్చి ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు చేపట్టారు. చినపాచిల నుంచి కొట్నాబిల్లి మీదుగా టి. అర్జాపురం వరకు పీఆర్ రోడ్డులో ఆరు చోట్ల కల్వర్టులు దెబ్బతిన్నాయి.
దొండ పూడి- కల్యాణపులోవ రోడ్డు మార్గంలో జెడ్. కొత్తపట్నం, చీమలపాడు, ములకలాపల్లి, జెడ్. జోగింపేట దగ్గర ఎనిమిది వరకు కల్వర్టులు బాగా దెబ్బతిన్నాయి. ప్రమాదకరంగా ఉన్న కల్వరులు దగ్గర కర్రలకు ఎర్రటి గుడ్డలు కట్టారు. బి.ఎన్ రోడ్డులో కొత్తకోట ఆర్ సి ఎం చర్చికి సమీపంలో కల్వర్టుకు పెద్ద రంధ్రం పడగా అక్కడ పోలీస్‌లు తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టారు. జి.చీడిపల్లి వద్ద కల్వర్టు గోడల మధ్యలోకి బీటలు బారాయి. రావికమతం తోటకూరపాలెం ఆర్‌ఈసి రోడ్డు మార్గంలో దాసరయ్యపాలెం, పిల్లవానిపాలెం, తట్టబంద తదితరపిల్లవానిపాలెం, తట్టబంద తదితర చోట్ల కల్వర్ధులు పాడయ్యాయి. కల్వర్టులు దెబ్బతినడంతో ఆ మార్గాల్లో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని పలువురు వాహన దారులు కోరుతున్నారు.

కల్యాణపులోవ మార్గంలోని ములకలపల్లి కల్వర్టు వద్ద ఏర్పాటు చేసిన జెండాలు

బిఎన్ రోడ్డులోని జి.చీడిపల్లి వద్ద దెబ్బతిన్న కల్వర్టు

కొత్తకోట సమీపంలోని బిఎన్ రోడ్డులో పడిన రంధ్రం

ఆదేశాలు సరే..పైసలేవీ?

-సొంత ఖర్చులతో పార్టీల రంగులు, స్టిక్కర్ల తొలగింపు

-కార్యదర్శులకు వదులుతున్న చేతిచమురు

ప్రజాశక్తి-పాడేరుటౌన్: గ్రామ పంచాయతీల కార్యదర్శులకు ఎన్నికల కోడ్ కొత్త కష్టాలు తెచ్చి పెట్టింది. జిల్లా పరిధిలోని పలు పంచాయితీల కార్యదర్శులకు కాసుల కష్టాలు మొదలయ్యాయి. ఎన్నికల నిబంధనలు అమలు చేసే క్రమంలో చేతి చమురు వదులుతోంది.
కోడ్ నేపథ్యంలో గ్రామాల్లో పలు నిర్మాణాలకు ఉన్న రాజకీయ పార్టీల రంగులు, స్టిక్కర్ల తొలగింపుపై ఆర్‌ఒలు ఆదేశాలు ఇస్తున్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చెట్టు, పుట్ట, గోడ ఏది వదలకుండా తమ పార్టీ రంగులతో నింపేసింది. ఆర్ బికె, సచివాలయాలు, వాటర్ హెడ్ ట్యాంక్లు, విద్యుత్ స్తంబాలకు వైసిపిని పోలిన రంగులు, ప్రతి ఇంటికి జగన్ చిత్రాలతో ఉన్న స్టిక్కర్లు ప్రధాన రహదారులపై ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగించాల్సి వచ్చింది. అయితే ఈ తొలగింపులకు సంబంధించి ఎటువంటి నిధులు పంచాయతీలకు కేటాయించ లేదు. స్టిక్కర్లు తొలగింపుతో పాటు రంగులు మార్చేందుకు పంచాయతీ కార్యదర్శులకు రూ.ఐదు వేలకుపైనే ఖర్చవుతోంది. సంబంధిత అధికారులు ఆదేశాలు జారీ చేయడం తప్ప నిధుల విషయమై ఎటువంటి స్పష్టత ఇవ్వక పోవడంతో కార్యదర్శులకు ఇబ్బందులు తప్ప లేదు. జేబులో డబ్బులు తీసి ఆయా పనులు చేపట్టాల్సి వస్తోంది. ఉన్నతాదికారుల ఆదేశాలను ధిక్కరించ లేక చేసేది లేక కొంత మంది తలలు పట్టుకుంటున్నారు. ఇంకొందరు అప్పులు చేసి మరీ తొలగింపు చర్యలు చేపట్టారు. ఖర్చుల విషయంపై కొన్నిచోట్ల మండల అధికారులు, కార్యదర్శులకు వాగ్వాదం జరుగుతోంది. ఏదేమైనా సంబంధిత నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు పంచాయతీలో నిర్వహించిన పనులకు అవసరమైన మొత్తాలను విడుదల చేస్తేనే కార్యదర్శులకు కాస్త ఊరట కలగనుంది.



రైతు భరోసా కేంద్రానికి రంగులు వేస్తున్న సిబ్బంది

ప్రారంభిస్తున్న ఎస్‌పి

పోలీస్ బ్యారక్‌ను ప్రారంభించిన అల్లూరి ఎస్‌పి

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండల కేంద్రంలో స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో నూతనంగా నిర్మించిన పోలీస్ బ్యారక్‌ను అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా శుక్రవారం ప్రారంభించారు. పోలీసులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం కోసం ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. నాలుగు గదులతో కూడిన బ్యారాక్‌కు ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాడేరు ఏఎస్పీ దీరాజ్, డిఎస్పీ(సి ఆర్ పీఎఫ్) ఉదయ్ కుమార్, సీఐ రమేష్, ఎస్సై శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.